


భయం భయంగానే మళ్ళీ వెనక్కి తిరిగి చూశాను. అవును. అనుమానం లేదు. అతను నన్ను ఫాలో అవుతున్నాడు. గుండెలు జల్లుమన్నాయి. చలివల్లనో భీతివల్లనోగాని నరాలు జివ్వుమంటున్నాయి. రోమాంచలం అయింది. చాలా దూరం నుంచి వెంబడిస్తున్న

అతగాడెవరో అంతుపట్టడంలేదు. నా పని పట్టించడానికి వాళ్ళు నియమించిన కిరాయి మనిషో, మఫ్టీలో వున్న పోలీసో కావచ్చు. నేను వేసుకున్న ప్లానంతా బట్టబయలయి పోయిందో ఏమో? ఆ ఆలోచన రాగానే ఒళ్ళంతా నిస్సత్తువ ఆవరించినట్టయింది. ఏది ఏమైనా ధైర్యం కూడగట్టుకోవాలి. అనుకొన్న దంతా ఈ రాత్రికే పూర్తి చెయ్యాలి.

సిగరెట్టు కాలిస్తే బావుణ్ణనిపించింది. జేబులు తడుముకున్నాను. ఉత్తి చేతులు బయటకు వచ్చాయి. నేను గమనించనేలేదు. క్షణాల మీద అతను నా దగ్గరకు వచ్చేశాడు. బిక్కు బిక్కుమంటూ మసక చీకట్లోనే అతన్ని తేరి పార చూశాను. తెల్లటి బట్టల్లో నల్లగా పొడుగ్గా వున్నాడు. అతని గుండెకాయ ఎర్రగా వుందో, తెల్లగా వుందో నల్లగా వుందో....

అతని చేతిలో సిగరెట్ పెట్టె. వళ్ళు సలపటం మొదలెట్టాయి. అడిగితే ఒకటివ్వక పోడు అనుకున్నాను. ఆలోచనలు చదవగలిగే మనిషిలా వున్నాడు. అడక్కుండానే 'హేవిట్' అంటూ చెయ్యి ముందుకు చాపాడు. గుండెలు లటుక్కు లటుక్కుమంటున్నాయి. తటపటాయిస్తూ కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాను. చివరకు నోరు పెగలదీసుకుని "మీరు...." అని మాత్రం అనగలిగాను.

"అర్ధరాత్రి ఆగంతకుడు ఎవడా అని ఆశ్చర్యపడక్కర్లా. శత్రువుని మాత్రం కాదు. షేకిట్" మూత తెరిచి అన్నాడు అతను.

భయం స్థానే ఆశ్చర్యం దోబూచులాడుతోంది. చిత్రమైన మనిషి. అంతరంగాన్ని ఇట్టేపట్టేస్తోన్నాడు. వణుతున్న చేతితోనే సిగరెట్ అందుకుని "థాంక్స్" అన్నాను నోట్లో పెట్టుకుంటూ.

"దట్సాల్‌రైట్" అంటూ మిగిలిన ఒక్క సిగరెట్‌నూ పెదాల మధ్య బిగించి ఖాళీ పెట్టెను కింద పారేశాడు.

ఆశ్చర్యం మళ్ళీ నన్ను ముంచెత్తింది. గుండెలు దడదడా కొట్టుకోవడం మొదలెట్టాయి. అంత చలిలోనూ ముచ్చెమటలు పోశాయి. అగ్గిపుల్ల వెలిగించకుండానే అతను సిగరెట్ పీలుస్తున్నాడు.

"....ఆర్....యూ....ఏ.... మెజీషియన్" అన్నాను పదాలు కూడబలుక్కుంటూ. అతను చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

అంతకన్నా ఆశ్చర్యం నా నోట్లో సిగరెట్ కూడా దానికదే వెలుగుతోంది. గట్టిగా ఒక్క దమ్ములాగి గుండెల్నిండా పొగపీల్చుకొన్నాను. హాయిగా వెచ్చగా వుంది.

"బలే చిత్రంగా వుందే" అన్నాను కొంచెం తేరుకొని.

"నా కూడా రా. ఇంతకన్నా చిత్రాలు చూపిస్తా" అన్నాడు.

గుండె దడ తగ్గింది. భయం టప్పున ఎగిరిపోయింది. అతన్ని వెంబడించాను. వేగంగా పడుతున్నాయి మా అడుగులు

జనసంచారం అసలు లేదనే చెప్పాలి. ఠాణాలో కొడుతున్న గంటలు లీలగా వినిపిస్తున్నాయి. అక్కడక్కడా చీకటి ముయ్యారంలో జీబూరు జీబూరుమంటున్నాయి చెట్లు. దూరంగా నక్కలు ఉండి ఉండి చేస్తున్న గానాలాపన కర్ణకఠోరంగా వినపడుతోంది.

"ఎక్కడికి?"

"చూద్దువుగాని."

మౌనంగా అతనిపక్కనే నడుస్తున్నాను. రెండు మూడు సందులు తిప్పి ఒక కాలనీలోకి లాక్కొచ్చాడు. ఏదో చటుక్కున గుర్తొచ్చినట్టు ఒక ఇంటిముందు ఆగాడు. చెయ్యి చురుక్కుమంది. ఆఖరిదమ్ము లాగి సిగరెట్టు కింద పారేశాను. అతడు సిగరెట్టు ఎప్పుడు పారేశాడో నేను గమనించలేదు. ఆలోచనలు ఊపిరి సలపనివ్వడంలేదు.

నా చెయ్యి పట్టుకొని ఆ ఇంటిముందు నడిపించాడు. ఇద్దరం ఆ ఇంటి వరండా దాటి తలుపు ముందుకు వచ్చాం. నాకు బితుకు బితుగ్గా ఉంది. మంత్రముగ్ధుడిలా అతని వెంట వెళ్ళడం మినహా మరేమీ చేయలేకపోయాను. తలుపు యెలా తెరిచాడో గుర్తులేదు. క్షణాల మీద లోపలి గదిలోకి వచ్చేశాం.

మంచంమీద వోరగా పడుకొని వున్న వ్యక్తి కసిగా "దర్టీ కంట్రీ" అనడం వినిపించింది.

"అవునవును" కీచుగొంతుతో వంతపాడాడు ఆగంతకుడు.

"సేఫ్ పీరియడ్ కూడా కాదు" అతన్ని అంటిపెట్టుకొని పడుకొన్న ఆమె నిట్టూరుస్తూ అంది.

పక్కనే ఉన్న చీరతో అతని నుదుటికి పట్టిన చెమటను తుడిచిందామె.

నా నరాలు పెళపెళ మంటున్నాయి.

"అవసరమయితే యేదో ఒకటి చేద్దాం లెండి" అందామె.

ఎదురుగావున్న మమ్మల్ని గుర్తించే స్థితిలో వాళ్ళు ఉన్నట్టులేరు. ఇద్దరూ బాత్‌రూమ్‌లోకి నడిచారు. మేమూ వెంబడించాం. గచ్చుమీద నీళ్ళు వొలికిన చప్పుడు. పిగిలిన కండోమ్ వెక్కిరిస్తూ మోరీలోకి జారిపోయింది.

నాలుగేళ్ళ పాపాయి అన్న యెందుకో నిద్దట్లో నవ్వుకొన్నాడు.

ఇద్దరం బయటకు వచ్చాం.

"అర్థమయిందా?" అన్నాడు ఆగంతకుడు.

"వూ" అన్నాను నెమ్మదిగా.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

"మీకు కనికట్టులాంటిదేమన్నా తెలుసా?" అన్నాను మళ్ళీ ఆశ్చర్యంగా.

"ఉష్!" అంటూ నోటికి అడ్డంగా కుడిచేతి చూపుడువేలు బిగించి తర్వాత చిన్నగా నవ్వేశాడు.

నేనూ నవ్వేశాను.

మళ్ళీ కొంతదూరం నడక. మామధ్య అంతగా మాటలు దొర్లడం లేదు. అతని కథా కమామిషూ వెంటనే అడిగి తెలుసుకోవాలని మహా కుతూహలంగా వుంది. కొంచెంసేపు ఓపిక పట్టడం మంచిదని నన్ను నేను నిగ్రహించుకున్నాను. ఈసారి ఇద్దరం ధర్మాసుపత్రిలోకి చొరబడ్డాం. మమ్మల్నెవరూ అడ్డగించకపోవడం ఈసారి నాకు ఆశ్చర్యంగా లేదు.

"చూడు."

"ఏవిటి?"

"బేనర్."

అరుగులమీదా, వరండాలోనూ ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా పడున్నాయి మహా నిద్రలోకి ఒరిగిపోయిన విగత జీవాలు.

చచ్చిన పాముల్లాంటి స్టెతస్కోపులూ, దీపాల వెలుతురులో ట్రేలతోపాటే మెరిసిపోతున్న తెల్ల గౌన్లూ, కర్రపెత్తనం చేస్తున్న కాకీ చొక్కాలూ తెగ హడావిడి చేస్తున్నాయి.

....ఏడ్పులూ .... మొత్తుకోళ్లూ.... నిట్టూర్పులూ....మూలుగులూ....పెడబొబ్బలూ....

....మేల్సూ.... ఫిమేల్సూ.... హైడ్రోసూ లాడ్రోసూ... హేవ్సూ.... హేవ్‌నాట్సూ....

....పత్తికాయల్లా పేలిపోయిన గుడ్లూ.... మెలికలు తిరిగిన చేతులూ....చచ్చుపడిన కాళ్ళూ....

....తెగీతెగని గాలిపటాలూ....టుప్పుమన బోయే గాలిబుడగలూ....

గుడుంబా వాసనకు ముక్కుపుటాలు ఎగిరిపోతున్నాయి.

"లెక్కపెట్టు" అన్నాడతడు.

ఆలోచన మళ్ళింది. లెక్క తెగక గొణుక్కున్నాను.

"డాక్ ఎడిషన్‌కు దెబ్బయ్యారు. సిటీ ఎడిషన్‌కు రెట్టింపు కావచ్చు" అన్నాడు.

నేను తల వూపడం చూసి—"చలో!" అన్నాడు.

రోడ్డుమీదకు వచ్చాం.

హోటల్ వెనుక పేవ్‌మెంటుమీద చెత్తకుండీ. పక్కనే పందులకూ, కుక్కలకూ కొంచెం యెడంగా, పుణ్యభూమి దౌర్భాగ్యానికి ప్రతీకల్లా, లోకం కుళ్ళు తెలీని బజారుబిడ్డలు. వంటిమీద సరైన ఆచ్ఛాదనన్నా లేకుండా చలికి వణుకుతూ మునగదీసుకొని పడుకున్నారు.

"కాంట్రాక్టరును పూనిన యముడో, యముణ్ణి పూనిన కాంట్రాక్టరో! పెద్దగా ఓ వెధవ నవ్వు నవ్వాడు...." చెప్పటం మధ్యలో




ఆపి అతను నావంక చూశాడు.

"వింటున్నా" అన్నాను.

"కడుతూ కడుతూ వున్న భవనం పెద్ద గోడ ఆ వికటాట్టహాసానికి నిలువునా కుప్ప కూలింది...."

"ప్చ....ప్చ...."

"....ఇద్దరు మగకూలీలూ, వారి పెళ్ళాలూ అక్కడి కక్కడే సజీవసమాధి అయ్యారు. నోట్లు చేతులు మారాయి. చేతులు జేబుల్లోకి వెళ్ళాయి...."

చేతులు రెండూ ఒక్కసారి గట్టిగా రుద్దుకొని పాంటుజేబుల్లో పెట్టుకొన్నాను.

"చలిగా వుందా?" అతడు అడిగాడు.

"వూ" అన్నాను నెమ్మదిగా.

"కొంచెం వోర్చుకో."

ఒక్కక్షణం ఆగి అతడు మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

"....అనాధ ప్రేతలకు సంస్కారం చేసిన పుణ్యం పెట్టోళ్ళకు దక్కింది. వీళ్ళ కిక్కడ ఇంత చోటు చిక్కింది" అన్నాడు.

"డబ్బుంటే పాపం చెరిపేసుకొని పుణ్యం కొనుక్కోవడం మహా తేలిక" అన్నాను వుండబట్టలేక.

అతను మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టున్నాడు. నాలుగయిదు అడుగులు వేశామో లేదో "నడుస్తున్న ఆ శవాన్ని చూడు" అన్నాడు మళ్ళీ.

అతను చెప్పింది నిజం. మా ముందు నడుస్తున్న ఆ వ్యక్తి అచ్చు పీనుగులా వున్నాడు. ప్రేతకళ వచ్చినట్టు ఇట్టే గ్రహించవచ్చు.

"విచ్చేకిందా?"

" ంత అదృష్టమా?"

"ఏం జబ్బు మరి?"

"మామూలు జబ్బే."

"అంటే?"

"ఆకలి జబ్బు."

"ఎవడీ దౌర్భాగ్యుడు?"

"ఆరేళ్ళు నిరుద్యోగం, మూడేళ్లు చిరుద్యోగాలూ చేశాడు. నానాగడ్డి కరిచి చివరకు బతకనేర్వని బడిపంతులయ్యాడు. జీతం పుచ్చుకొని ఏడాది, తిండి తిని నాలుగు రోజులూ, విషం తాగి రెండు రోజులూ అయింది...."

"ఇట్స్ రియలీ హెల్" అన్నాను విచారంగా.

"కొందరికి చచ్చేందుకూడా హక్కుండదు. మనిషిని నల్లగా నిలువేల్లా కాటేసే గరళం

తెల్లగా పాలిపోయి ఇతని ముందు గుడ్లు తేలేసింది'' అన్నాడు.

గుండెల్లో చెయ్యిపెట్టి దేవినట్టయింది.

ట్రంకు రోడ్డుమీద లారీలు పెద్దగా చప్పుడు చేస్తూ పరుగెడుతున్నాయి. నిద్రపట్టని కుక్కలు ఎందుకోగాని వుండి వుండి మొరుగుతున్నాయి. మునిసిపల్ దీపాలు ఒక్కసారి ఆరిపోయి మళ్ళీ వెలిగాయి.

రోడ్డు పక్క యింటి అరుగుమీద ముసుగు వేసుకొని మౌనంగా రోదిస్తూన్న ఒకామెను చూడమన్నట్టు సైగ చేశాడు. ఆమె వడిలో పసికందు ఆదమరిచి నిద్రపోతున్నాడు. నేను అడక్కుండానే అతను చెప్పడం మొదలు పెట్టేడు.

"దిక్కులేని పక్షి. ముగ్గురు బిడ్డల తల్లి."

"పాపం.''

''....గుర్తింపులేని వెట్టిచాకిరీ చేసి చేసి మూలన పడ్డాడు మొగుడు."

''ఆ జబ్బేనా?''

''అలాంటిదే....భయంలేదు. దివ్యౌషధం. క్షణాలమీద అంతా చక్కబడుతుం దన్నాడు డాక్టరు గ్యారంటీగా. డాక్టరు మాట బీరుపోలేదు. అంతా నిమిషాలమీద అయిపోయింది."

"ఉయ్ హేవ్ టు షూట్ దెమ్ ఆల్...." అన్నాను కొంచెం గట్టిగా.

ఉద్రేకంపాళ్ళు అతగాడిలో ఏ కోశానా వున్నట్టు లేవు.

"యస్సెస్" అని అతి నెమ్మదిగా మాత్రం అన్నాడు.

ఆకాశంలో మిణుకు మిణుకుమంటున్న చుక్కల్ని చూశాను. తర్వాత అతన్ని ఎగాదిగా చూశాను. ప్రపంచాన్ని కాచి వడబోసి పుక్కిట పట్టిన తేజోమూర్తిలా వున్నాడు. మహాఠీవిగా, గంభీరంగా అడుగు లేస్తున్నాడు.

"సస్పెన్సుతో చంపేస్తూన్నారు. ఇంతకూ మీరెవరో ఏమిటో చెప్పనేలేదు...." అతని పక్కనే నడుస్తూ ఇక వుండబట్టలేక కక్కేశాను....

"ఉష్" అటు చూడమన్నట్టు సైగ చేశాడు.

ఇంటి పెరటిలో చెట్టుకింద రెండు ఆకారాలు....

"....ఆ రాత్రి బాగా వర్షం పడింది."

"అయితే...."

'తమాయించుకోలేకపోయాను.'

"చెప్పడానికి సిగ్గెయ్యడంలేదూ?"

"మన మధ్య రహస్యా లుండకూడదని నువ్వే అన్నావ్."

"అన్నాను."

"తెలిసో తెలియకో పొరపాటు జరిగితే గోరంతలు కొండంతలు చేసుకోకుండా సర్దుకుపోవాలన్నావ్."

"అంటే అనుండొచ్చు."

"అనుండొచ్చు కాదు. అన్నావ్."

"అయితే ఏమంటావ్?"

"ఆరు నూరయినా నూరు ఆరయినా మనం విడిపోకూడదన్నావ్."

"అంటే నిన్ను నెత్తిమీద పెట్టుకుని వూరేగమంటావా?"

"అలాగని నేను అనలేదే!"

"మరి....?"

"గుట్టు రట్టు కాకుండా చేసుకునే తెలివితేటలు నాకు తెలీకే బయట పడ్డానను కొంటున్నావా?"

"అతిగా వాగకు."

"పోనీ నీ ప్రియురాళ్ళ గురించి కొంచెం కొంచెం చెప్పమన్నావా?"

"గొప్ప తెలివిగా మాట్లాడుతున్నాననుకోమాకు."

"నీలా నంగనాచి కబుర్లు చెప్పడం నాకు చేతకాదు."

"బరి తెగించావ్."

"అదే నేనూ అంటే!''

"వెయ్యి చెప్పు నీకూ, నాకూ ఇక సరి పడదు.''

''నీ కాళ్ళు పట్టుకుని బతిమాలతాననుకుంటున్నావా?''

"నిన్నెవడు కట్టుకుంటాడో చూస్తాను."

"గొప్ప హీరోవి మరి?''

"షటప్."

"యూ షటప్."

"..............."

"..............."

మాంచి రసవత్తరంగా కథ నడుస్తూంటే పూర్తిగా విననివ్వకుండా, మాటా మంతీ లేకుండా ఆగంతకుడు నన్ను చెయ్యి పట్టుకుని ముందుకు లాక్కుపోవడం మొదలెట్టేడు. నేను చెయ్యాల్సిన పని చటుక్కున గుర్తు కొచ్చింది. ఇతగాడి మాయాజాలంలో చిక్కుకుని అసలు సంగతి మరిచిపోయాను.

"ఎక్కడికి?" కోపంగా అన్నాను.

"కోపమొచ్చినట్లుందే" అతగాడు శాంతంగా అన్నాడు.

"నన్నింక ఒదిలిపెట్టు" చెయ్యి ఒదుల్చుకుంటూ అన్నాను.

అతను నా చెయ్యి ఒదిలేశాడు.

"ఎక్కడికి కెళ్ళాలేమిటి?"

"నీకనవసరం."

"నువ్విప్పుడు ఇంటికెళ్ళడం అనవసరం" అన్నాడు.

గతుక్కుమన్నాను.

"ఎందుకని?" అప్రయత్నంగాఅడిగాను.

"నువ్వుతలపెట్టిన పని ఈ జన్మలో చేయలేవు గనక."

"చేయగలను."

"చేయలేవు."

"ఐ కెన్."

"యు కాంట్."

"నేనేమీ చేయాలనుకున్నానో, ఎందుకు చేయలేనో నీకెలా తెలుసు?"

"నా కంతా తెలుసు"

"నీకు టెలిపతీ తెలుసా?"

అతను సమాధానం చెప్పలేదు.

"నీకేంతెలుసో చెప్పు చూద్దాం" రెట్టించాను.

రోడ్డు మధ్యలోనడుస్తున్నాం. అతివేగంగా యమకింకరుడిలా, దీపాలన్నా లేకుండా ముందుకు దూసుకువస్తున్న లారీని ఆ క్షణంవరకూ మేముచూడనేలేదు. క్షణాలమీద మమ్మల్నిమట్టి కరిపించేస్తుంది. అంతా అయిపోయిందనుకున్నాను. అవాక్కయిపోయాను. నరనరాల్లోంచి చలిజ్వరంలాంటి వణుకు. ముందుకుగాని, వెనక్కుగాని, అటుగాని, ఇటుగాని ఎటూకదలలేకపోయాను. చెప్పరానిభయంతో గట్టిగా అరుస్తూ కుప్పలా కూలిపోయాను. అతడు నా నడుం పట్టుకొని పైకిగుంజడం లీలగా గుర్తుంది. గాలిలో తేలిపోయినట్టుభావన. భయంభయంగానే కళ్ళు తెరచిచూశాను. ప్రమాదం తప్పిపోయింది. లారీ వెళ్ళిపోయింది. మేమింకా రోడ్డుమధ్యేవున్నాం.

"ప్రక్కనేనడుద్దాం" అంటూ అతణ్ణి ఓ పక్కకు లాక్కొచ్చాను. కొంచెంకొంచెంగా తెప్పరిల్లాను.

"మీరు నిజంగా దేవుడు. రక్షించారు" అన్నాను అతన్ని గట్టిగా కౌగలించుకొంటూ.

"కాదు నీలాంటి వాణ్ణే" అన్నాడతడు.

"ఆర్ యూఏ పారాసైకాలజిస్ట్?"

అతనినుంచి సమాధానం లేదు.

"మీరెవరో నాకుచెప్పకపోయినా, నాగురించి మీకు చెప్పాలనుకొంటున్నా" అన్నాను తిరిగి.

"ఆవసరంలేదు"

"మీరు నిజంగా దివ్యపురుషులేమోనని నా అనుమానం"

అతను మామూలుగా మళ్ళీ నవ్వి ఊరుకున్నాడు.

"ఆ నవ్వుతోనే నన్ను కట్టేస్తున్నారు. మీరెవరో మీసంగతేమిటో చెబితేగాని వూరుకొనేది లేదు. ముందు నాగురించి ఏంతెలుసో చెప్పండి" దబాయించినట్టు గట్టిగా అడిగాను.

"చెప్పక తప్పదా?"

"తప్పదు"

"అయితేవిను...."

గుండెలు పీచుపీచు మనడం మొదలు పెట్టాయి.

"ప్రేమించి పెళ్ళిచేసుకొన్నావ్. అవునా?"

"అవును."

"తర్వాత ఖంగుతిన్నావ్."

నేను మాట్లాడలేదు.

"వట్టిపనికిమాలిన గుమస్తాగాడు అంటూ మీ ఆవిడ ఈసడించుకోవడం నీకు తెలుసు."

"అవును,"

"కువైట్ కుర్రాడితో లేచిపోదామని ప్లాను కూడా వేసుకొంది"

"దాని ప్రేమ వట్టి బూటకం అని తెలిసి పోయింది. అందుకే ఇద్దర్నీ పైకి పంపేద్దామను కొంటున్నాను."

"ఆ సంగతి నాకూ తెలుసు, ఆ పని నువ్వు చెయ్యలేవనికూడా తెలుసు"

"ఎందుకుచెయ్యలేను?" గట్టిగా అన్నాను.

"వాళ్ళిద్దరూ ముందే నీపని పట్టేశారు గనుక" నావంక సూటిగా చూస్తూ సౌమ్యంగా అన్నాడు ఆగంతకుడు.

"ఏవిటీ?" అతను చెబుతున్నది ఒక పట్టాన అర్థంగాక అయోమయంగా చూశాను.

"గుర్తు తెచ్చుకో"

కళ్ళముందు పచ్చటి....ఎర్రటి....నల్లటి.... తెల్లటి.... రంగుల కాంతులు....గాజుగ్లాసు.... గ్లాసులో తియ్యటి తెల్లటి పాలు....మైకం.... మైకం....మైకం....

ఒళ్ళంతా ఒక్కసారి జలదరించినట్టయింది. పుట్టెడు దుఃఖం అమాంతం ముంచుకొచ్చింది.

"అవును గుర్తొచ్చింది. భయంభయంగా ఉంది" అన్నాను అతని చెయ్యిగట్టిగా పట్టు కొంటూ.

"ఇంకా నీకు పాతఅలవాట్లు అనుభూతులూ పోలేదు. తొందర్లోనే పోతాయిలే" అన్నాడు భుజంమీద చేయివేస్తూ.

"ఇక మీసంగతి చెప్పండి?" అన్నాను.

"ఒక్కముక్కలో చెప్పాలంటే నీకు కొంచెం సీనియర్ని" నవ్వుతూ చెప్పాడు.

"ఏమిటీ?" అన్నాను కుతుహలంగా.

"చంటి బిడ్డనెత్తుకొని ఏడుస్తూ కూచుంది చూశావూ? ఆమెకు ఒకానొకప్పుడు మొగుణ్ణి"

నా అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి.

....సుఖం—దుఃఖం—రాగం - ద్వేషం— కోపం—తాపం—స్వార్థం — పరమార్థం— కష్టం—నష్టం—పాపం —పుణ్యం—కలిమి లేమి వంటివి అణుమాత్రంరేని ద్వంద్వాతీత ప్రపంచంలో నిశ్శబ్దంగా నవ్వుతున్న నా మిత్రుడితో శృతికలిపాను.

"కింకర్తవ్యం?" అన్నట్టు అతని ముఖంలోకి చూశాను.

"కుత్సిత ప్రపంచంబొరుసును మాత్రమే చూశావ్. బడుగుజీవుల్ని ఉన్న పళంగానే పీక్కుతినే రాబందుల రెక్కలచప్పుడూ, అగ్ని శిఖల అట్టడుగు ఆక్రందనలూ వినబడే అసలు బొమ్మను చూద్దువుగాని నడువ్" అంటూ అతను నా చెయ్యి పట్టుకొని ముందుకు వడి వడిగా అడుగులు వేయసాగాడు.

దూరంగా కర్తవ్యం మరచిపోని తొలి కోడి అరుపు....అవచేతన స్థితిలోంచి పుట్టుకొచ్చిన భీకర ఘోషలూ, చీకటి నీడల క్రీనీడలూ, నైరూప్య దృశ్యాల అన్యాపదేశాలూ ఒక్కొక్కటే క్రమంగా అదృశ్యంకాసాగాయి.... □


## ఎదురుచూడండి!

ఇంతవరకూ ఏ తెలుగు పత్రికా సమర్పించని

అద్భుతమైన సైంటిఫిక్, సస్పెన్స్ సీరియల్,

జ్యోతి (మాసపత్రిక) సమర్పించబోతోంది !